క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

పులిచెర్ల(కల్లూరు):పులిచెర్ల మండలంలోని సబ్–స్టేషన్లలో మరమ్మతు లకు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పురుషోత్తం తెలిపారు. మండలంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

విరూపాక్షి మారెమ్మకు ఆషాఢ పూజలు


విశేషాలంకరణలో అమ్మవారు

పుంగనూరు: పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారెమ్మ ఆలయంలో ఆషాడ మాసం శుక్రవారం సందర్భంగా రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

గుర్తింపు కార్డుల పంపిణీ


సదుం: గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

సదుం: మండంలో నూతనంగా తొమ్మిది మంది డప్పు కళాకారులకు మంజూరైన గుర్తింపుకార్డులను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప శుక్రవారం పంపిణీ చేశారు. కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు వారు చెప్పారు.

పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలు: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు. కార్యక్రమాల్లో డీటీ కుమార్, కోఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, బాబురెడ్డి, రమేష్‌రెడ్డి, రమణారెడ్డి, సీతాపతి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రామకుప్పం జాతర

రామకుప్పం: మండలకేంద్రంలోని శ్రీగంగమ్మ దేవాలయంలో ఆదివారం నుంచి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సోమవారం జ్యోతినగర వైశ్య(గాండ్ల) సంఘం ఆధ్వర్యంలో అభిషేకం, అన్నదానం, మంగళవారం సజ్జల చెంగారెడ్డి కుటుంబ సభ్యులు, ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అభిషేకం, అన్నదానం, పచ్చగెరిగ, బుధవారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో అభిషేకం, అన్నదానం, పుష్పపల్లకీ సేవ ఉంటుందని పేర్కొన్నారు. గురువారం గ్రామస్తుల ఆధ్వర్యంలో వసంతోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు.

రాయితీపై రాగి విత్తనాలు


ఏడీ శివకుమార్


పుంగనూరు: పుంగనూరు వ్యవసాయ డివిజన్ పరిధిలోని ఆరు మండలల్లోని రైతులకు 50 శాతం రాయితీపై రాగి విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పుంగనూరు, చౌడేపల్లె, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం, పెద్దపంజాణి, గంగవరం మండలాలకు కలిపి 49 క్వింటాళ్ల రాగులను ప్రభుత్వం పంపిందన్నారు. మార్కెట్‌ల కిలో రూ.69.50 పైసలు కాగా, ప్రభుత్వ రాయితీతో రూ.34.75 పైసలకు రెండు కిలోల బ్యాగ్‌ను అందజేస్తామని తెలిపారు. చిరుధాన్యాలను సాగును ప్రోత్సహించేందుకు రాయితీపై ఇతర ధాన్యాలను కూడ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు ఆధార్‌కార్డులతో కార్యాలయంలో విత్తనాలు పొందాలని సూచించారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమిపూజ చేస్తున్న ప్రజా ప్రతినిధులు

బైరెడ్డిపల్లె: మండలంలోని బేలుపల్లెలో శుక్రవారం సిమెంటు రోడు పనులకు భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో ఇటీవల ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, ఎంపీపీ రెడ్డెప్ప గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ గ్రామం నుంచి పలమనేరు–కుప్పం జాతీయ రహదారి వరకు రహదారి గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు వారి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు విడుదల చేశారు. శుక్రవారం రోడ్డు పనులకు సర్పంచ్ వెంకటేష్, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌మొదలి భూమి పూజ చేశారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గుండెపోటుతో వలంటీర్ మృతి


సుధ(ఫైల్)

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మతుకువారి పల్లె పంచాయతీ గువ్వల వారిపల్లెకు చెందిన మహిళా వలంటీరు సుధ (34) గుండెపోటుతో మృతి చెందారు గురువారం రాత్రి ఇంటిలో కుట్టుమిషన్‌పై బట్టలు కుడుతుండగా ఉన్నట్టుండి కుప్పకూలారు. గమించిన కుటుంబ సభ్యులు కల్లూరుకు చికిత్స కోసం తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

గ్రామ స్వరాజ్యం సాకారం

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలందించాలన్న సత్సంకల్పంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారమైంది. ప్రజలు సులభతరంగా ప్రభుత్వ సేవలు అందుకుంటున్నారు. 2019 అక్టోబర్ 2న ప్రారంభమైన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలనూ క్షేత్రస్థాయిలో అందుతున్నాయి.

- సచివాలయాల వ్యవస్థతో గ్రామస్వరాజ్యం
- జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు
- కష్టాలు తప్పాయని గ్రామీణుల్లో ఆనందం



గంగవరం మండలంలో...

గ్రామ సచివాలయాలు –	18
అందుబాటులోని సేవలు –	540
మొత్తం సచివాలయాల్లో సిబ్బంది –	160 మంది
వలంటీర్లు –	305 మంది

గంగవరం: సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రజలు మండల కేంద్రం చుట్టూ ప్రదక్షిణలు చేయకుండా స్థానికంగానే తమ సమస్యలు పరిష్కరించుకుంటున్నారు. 50 ఇళ్లకు ఒకరు వలంటీర్ పని చేస్తుండడంతో ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిటే అందుతున్నాయి.

నాడు అలా...

సచివాలయ వ్యవస్థ ఆవిర్భవించక ముందు ప్రజలకు ఏ చిన్న పని చేసుకోవాలన్న మండల కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. అంతేగాక వ్యయ ప్రయాసాలకోర్చాల్సి వచ్చేది. పింఛన్ పొందాలన్నా ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. పింఛన్ దారులకు సకాలంలో పింఛన్లు అందక అవస్థ పడేవారు. ఒక్కొక్క సమయంలో జన్మభూమి సభల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్ కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితులుండేవి.

నేడు ఇలా...

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనతో రూపుదిద్దుకున్న సచివాలయ వ్యవస్థ ద్వారా సమస్యలు సకాలంలో పరిష్కారం కావడంతో పాటు అనేక సేవలు పల్లె ముంగిటకే అందుబాటులోకి వచ్చాయి. గతంలో సర్టిఫికెట్ల కోసం మండల కార్యాలయం, అధికారులు చుట్టూ తిరిగే వారు. నేడు ఆ పరిస్థితి లేదు. రోజుల వ్యవధిలోనే సర్టిఫికెట్లను పొందగలతున్నారు. సచివాలయవ్యవస్థతో సంక్షేమ, అవినీతి రహిత పారదర్శకంగా అమలు జరుగుతోంది. ఇక వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్ దారులకు ఒకటో తేదీన ఉదయమే ఇంటికి వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో చిత్తశుద్ధితో కూడిన సేవా కార్యక్రమాలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఏకంగా 500లకు పైగా సేవా కార్యక్రమాలు ప్రజల ముంగిటకే ప్రవేశపెట్టారు.

ఆన్‌లైన్ సేవలన్నీ సచివాలయాల్లోనే..

గత ప్రభుత్వ హయాంలో ప్రజలు కాళ్లరిగేలా మండల కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేసినా సమస్యలు పరిష్కారం అయ్యేవి కావు. నాయకులకు ముడుపులు చెల్లించడంతో పాటు అధికారుల వద్దకు వందసార్లు తిరిగినా సకాలంలో పనులు సాగేవికాదు. ఈ ప్రభుత్వంలో ప్రజల కష్టాలకు చెక్ పెట్టింది. ప్రజలకు తమ సొంత గ్రామాల్లోనే సచివాలయాలు స్థాపించిన ప్రభుత్వం ఆన్‌లైన్ సేవలన్నీ సచివాలయాల్లోనే చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. స్పందన ద్వారా కలెక్టరేట్ స్థాయి అధికారులు నేరుగా గ్రామాలకే వెళ్లి సమస్యలు పరిష్కరిస్తున్నారు. ప్రతినెలా చివరి శుక్ర, శనివారాల్లో సచివాలయం సిబ్బంది, వలంటీర్లు కలిసి సిటిజన్ ఔట్రీచ్ ద్వారా ఇంటింటికీ వెళ్లి ఆ నెలలో అమలయ్యే పథకాలు గురించి వివరిస్తున్నారు.. కొత్తగా జగనన్నకు చెబుదాం 1902 నంబర్ ద్వారా ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా సీఎంఒకు చెప్పడం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. అలాగే జగనన్నకు చెబుదాం అనుబంధంగా జగనన్న సురక్ష కార్యక్రమం అమలు కావడంతో మండల అధికారులు ప్రతి సచివాలయంలో ఒక్కోరోజు క్యాంపులు ఏర్పాటు చేసి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ఇప్పటికే వెయ్యికిపైగా ఉచితంగా సర్టిఫికెట్లను ప్రభుత్వం అందజేసింది.

టీడీపీలో కూడా ఇంత లబ్ధి అందలేదు



జగనన్న ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మా ఒక్కింటికే రూ.లక్షల్లో లబ్ధి అందింది. నా భర్త రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఒకేసారి రూ.5 లక్షలు వైఎస్సార్ ప్రమాద బీమా ఇచ్చారు. నా బిడ్డల చదువులకు విద్యాదీవెన, అమ్మఒడి, నాకు వితంతు పింఛన్ ఇలా ఎన్నో పథకాలు మా ఇంటికి వచ్చాయి. ఇది జగనన్న గొప్పతనమే. మీ ఇంటిలో టీడీపీకి ఓట్లు వేసినా ఇన్ని రూ. లక్షలు జగనన్న మీ కుటుంబానికి ఇచ్చారు కదా అని నన్ను మా ఊరిలో చాలా మంది అడిగారు. నిజమే చెప్పాను.. టీడీపీలో కూడా మాకు ఇన్ని పథకాలు అందలేదు. మా ఇంటిలో టీడీపీ ప్రచారాలకు వెళ్ళినా మనం మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలి. ఏదేమైనా జగనన్న పాలన చాలా బాగుంది.

– వసంతమ్మ, నడింపల్లి

అర్జీ పెట్టిన వెంటనే ఇల్లు మంజూరు



మేము బాగున్నామంటే కారణం ఈ ప్రభుత్వం చలువతోనే. ఇల్లు లేని మాకు గ్రామ సచివాలయంలో అర్జీ పెట్టుకున్న వెంటనే ప్రభుత్వం నుంచి మంజూరైంది. గతంలో ఎందరినో ముఖ్యమంత్రులను చూశాం. కానీ ప్రజా శ్రేయస్సు కోసం అనుక్షణం పరితపించే ముఖ్యమంత్రిని ఇప్పుడే చూస్తున్నాం. ఇల్లుతో పాటు అనేక సంక్షేమ పథకాల కింద రూ.లక్షల్లో లబ్ధి అందింది. మాలాంటి పేద ప్రజల కోసం ఆలోచిస్తున్న జగనన్నే మళ్లీ సీఎం కావాలి. కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి ఇంటి ముంగిటకే తలుపు తట్టి మరీ అర్హులైన ప్రతి ఒక్కరికీ సచివాలయ వ్యవస్థ ద్వారానే పథకాలు అందుతున్నాయి.

– గిరిజ, గృహిణి, కీలపట్ల గ్రామం

జగనన్న సురక్ష.. ప్రజలకు శ్రీరామరక్ష


కలగటూరులో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ


బైరెడ్డిపల్లె: ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

బైరెడ్డిపల్లె: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష పథకం ప్రజలకు శ్రీరామరక్ష, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చేందుకే ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ అన్నారు. మండలంలోని దేవదొడ్డిలో శుక్రవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా 11 రకాల సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉండి ప్రభుత్వ పథకం అందని వారికి సైతం లబ్ధి చేకూర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వాలు మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు కాగితాలకే పరిమితం చేసేవారని, సీఎం జగనన్న మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలను కూడా అమలు చేసి ప్రజల్లో విశ్వసనీయత పెంచుకున్నారన్నారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కార్తిక్, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

అక్కడికక్కడే పరిష్కారం

గంగవరం: అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించాలనే గొప్ప ఆలోచనతో జగనన్న సురక్షను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టారని ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. శుక్రవారం మండలంలోని గుండుగల్లు, కలగటూరు సచివాలయాల్లో జగనన్న సురక్ష నిర్వహించారు. కలగటూరు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ఆన్‌లైన్ ద్వారా అప్లై చేసుకున్న వారికి పలు సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చిన్న సర్టిఫికెట్ పొందాలంటే మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగినా సాధ్యపడేది కాదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లోనే సచివాలయాలను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో నాడు–నేడు పనులను పరిశీలించారు. పాఠశాలలో విద్యాబోధన, మధ్యాహ్న భోజనం అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డి, ఎంపీటీసీ భారతి, గుండుగల్లు సర్పంచ్ రమణ, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, చలపతిరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ వినోద్‌రెడ్డి, ఎంపీడీవో తాజ్‌మస్రూర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి


సోమల: ఆవులపల్లెలో సర్టిఫికెట్ల పంపిణీ


రామకుప్పం: ధ్రువీకరణ పత్రాల అందజేత


చౌడేపల్లె: ధ్రువీకరణపత్రాల పంపిణీ


పులిచెర్ల: వెంకట దాసరపల్లెలో..


పెద్దపంజాణి : సర్టిఫికెట్ల పంపిణీ



రొంపిచెర్ల: పెద్దమల్లెలలో..

పులిచెర్ల(కల్లూరు): జగనన్నసురక్ష పథకంలో ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మండలంలోని వెంకట దాసరపల్లె సచివాలయంలో శుక్రవారం జగనన్న సురక్షలో అర్హులైన లబ్ధిదారులకు అక్కడికక్కడే సర్టిఫికెట్లను అందజేశారు. ఎంపీటీసీ పోకల చంద్ర, నాగరాజ ప్రసాద్, దామోదర్, ద్వారక, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

322 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

సోమల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆవులపల్లె సచివాలయ పరిధిలో సర్పంచ్ కోదండరాజు, ఎంపీటీసీ అపరాజిత ఆధ్వర్యంలో జగనన్న సురక్ష క్యాంప్‌ను నిర్వహించారు. అర్హులైన లబ్ధిదారులకు 322 ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, వైస్ ఎంపీపీ ప్రభాకర, స్పెషలాఫీసర్ శివకుమార్, డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్ బాబు, ఎంపీడీఓ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి లబ్ధి

చౌడేపల్లె: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకాల లబ్ధి చేకూర్చాలని ఎంపీపీ రామమూర్తి సూచించారు. శుక్రవారం చౌడేపల్లె సచివాలయం –2 ఆవరణలో ప్రత్యేక అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ పథకాల అమలు, సురక్ష ఉద్దేశాన్ని వివరించారు. 82 మంది దరఖాస్తుదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎంపీడీఓ సుధాకర్, సర్పంచ్ వరుణ్‌భరత్, సచివాలయాల కన్వీనర్ రుక్మిణమ్మ, ఉపసర్పంచ్ అల్తాఫ్ పాల్గొన్నారు.

ప్రజలకు వరం

పెద్దపంజాణి: సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదని ఎంపీపీ ఎన్. రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి తెలిపారు. శుక్రవారం బట్టందొడ్డిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. దరఖాస్తు దారులకు 11 రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు సుష్మకీర్తి, వైస్ ఎంపీపీ జీడీ బాబు, సింగిల్ విండో చైర్మన్ సంపల్లి బాబు రెడ్డి, నియోజకవర్గ ప్రత్యేక అధికారి గోవర్దన్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి రవికుమార్, తహసీల్దార్ లోకేశ్వర రావు, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ పృథ్వీ, సర్పంచ్ అర్చన, ఎంపీటీసీ సభ్యుడు గురుమూర్తి పాల్గొన్నారు.

263 మందికి ధ్రువపత్రాల పంపిణీ

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ సచివాలయం–1 పరిధిలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో 263 మందికి ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ సుబ్రమణ్యం మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులకు ధ్రువపత్రాలు సకాలంలో అందిస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్ మురళి, సర్పంచ్ రాజ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ నేతలు చంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, కేశవరెడ్డి, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు

రొంపిచెర్ల: పార్టీలకతీతంగా పథకాలను మంజూరు చేస్తున్నట్లు ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దమల్లెల గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరినాథరెడ్డి, వైస్ ఎంపీపీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, ఎంపీడీవో రాజేంద్ర, తహశీల్దార్ అమరనాథ్, సర్పంచ్‌లు రమణయ్య, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

కుప్పం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కుప్పం నాయకులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండు ప్రాగణంలోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, కేక్ కట్ చేసి, అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.

పెద్దపంజాణి: మండల కేంద్రంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగా రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

సోమల: మండల కేంద్రంలో శనివారం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గంగాధరం రాయల్ తెలిపారు. వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం రైతు దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సదుం: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద శనివారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం


వి.కోట: కార్యక్రమంలో పాల్గొన్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

పలమనేరు: పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఎమ్మార్‌పీఎస్ 29వ ఆవర్భావ దినోత్సవాన్ని స్థానిక ఎమ్మార్‌పీఎస్ నేతలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. నియోజకవర్గ కన్వీనర్ యువరాజు, కో–కన్వీనర్ ఈశ్వర్, రమణ, హరిక్రిష్ణ పాల్గొన్నారు.

వి.కోట: మండల కేంద్రంలో 29వ ఎంఆర్‌పీఎస్ ఆవిర్భవ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటచలం మాదిగ, ఎంఎస్‌పీ ఇంచార్జి వెంకటేష్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. వారు మాట్లాడుతూ మాదిగకుల ఆస్తిత్వం , ఆత్మగౌరవం, మాదిగ జాతి సామాజిక అభివృద్ధి, ఆర్థిక, రాజకీయ హక్కుల కోసం ఎంఆర్‌పీఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుంటుందని పేర్కొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. నాయకులు పృథ్వీరాజ్, నాగభూషణం , వెంకట్రమణ, సుబ్రమణ్యం, నారాయణ, సోము, కుమార్, సురేష్, వాలెప్ప పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం


పేటూరు పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ శివరత్నమ్మ

సోమల: మండలంలో రెండో విడత మంజూరైన పాఠశాలల్లో నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ–2 శివరత్నమ్మ ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలోని కోత్తూరు, ఆవులపల్లె, టీఎం.గొల్లపల్లె, అన్నెమ్మగారిపల్లె, పేటూరు పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఉపాధ్యాయుల, పిల్లల హాజరును పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాలు బోధించాలని సూచించారు.

నేడు అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం

పలమనేరు: పలమనేరు ఏఎంసీ ఆవరణలో నిర్మించిన నియోజకవర్గ స్థాయి అగ్రిటెస్టింగ్ ల్యాబ్‌ను రైతు దినోత్సవం సందర్భంగా శనివారం ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రారంభించనున్నట్టు స్థానిక వ్యవసాయశాల సహాయ సంచాలకులు అన్నపూర్ణ దేవి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలన్నారు.

బైజూస్ యాప్‌పై శిక్షణ


సూచనలిస్తున్న కోర్సు డైరెక్టర్ బాలసుందరం

పలమనేరు: పలమనేరు డివిజన్ ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు బైజూస్, ఇంటర్యాక్టివ్ ఫ్లాట్ ఫెనాల్ యాప్‌లపై పట్టణంలోని మదర్ థెరీసా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం మొదలైంది. ఈనెల 16వ తేదీ వరకు శిక్షణ జరగనుంది. విద్యాబోధనలో ఐఎఫ్‌పీ ప్యానెల్‌ను ఎలా ఉపయోగించాలి, బైజూస్ ట్యాబ్‌లో ఎర్రర్స్‌ను ఎలా క్లియర్ చేయాలో రిసోర్స్‌పర్సన్స్ వివరిస్తారు. ఈ శిక్షణకు డైరెక్టర్‌గా పలమనేరు ఎంఈవో బాలసుందరం వ్యవహరిస్తారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు

వి.కోట: మండలంలోని బోయచిన్నాగనపల్లె పంచాయతీ నాయకనేరి గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పాటుకు ఎంపీపీ యువరాజు స్థలం కేటాయించారు. ఆగ్రామానికి చెందిన యానాది కులస్తులు శుక్రవారం ఎంపీపీని కలిసి శ్మశాన వాటిక సమస్యను తెలియజేశారు. స్పందించిన ఎంపీపీ వెంటనే ప్రభుత్వ స్థలమైన 350/5 సర్వే నంబర్‌లో 30 సెంట్ల భూమిని శ్మశాన వాటికకు కేటాయిస్తామని తెలిపారు. కాగా, దాసార్లపల్లెలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష లో ఎంపీపీ యువరాజు పాల్గొని అర్హులకు ధ్రువపత్రాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలగురునాథ్, పంచాయితీ ఈఓ యాదవపతి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

పలమనేరు: పట్టణంలోని లయన్స్‌సేవా కేంద్రం నూతన కార్యవర్గ ఎంపిక శుక్రవారం స్థానిక సేవా కేంద్రంలో జరిగింది. అధ్యక్షుడిగా రఘుపతి, సెక్రటరీగా వీరభద్ర, కోశాధికారిగా గోపిలాల్‌తో పాటు కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్టు పూర్వ అధ్యక్షుడు రవి తెలిపారు.

హౌసింగ్ బెస్ట్ ఈఈగా రమేష్ రెడ్డి


అవార్డు అందుకుంటున్న రమేష్‌రెడ్డి

పలమనేరు: జగనన్న గృహ నిర్మాణాల్లో పలమనేరు నియోజకవర్గం జిల్లాలో తొలిస్థానంలో నిలవడంతో స్థానిక ఈఈ రమేష్ రెడ్డి బెస్ట్ ఈఈగా అవార్డు అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవర్భావ దినోత్సవం సందర్భంగా జగనన్న గృహాల నిర్మాణంలో ఉత్తమ ప్రగతి చూపిన అధికారులకు సంస్థ ఎండీ లక్ష్మీషా నుంచి అవార్డులను ప్రదానం చేశారు.

ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

పలమనేరు: పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలని సంఘం పట్టణ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫామ్ –16 సంబంధించిన అనుమానాలను నివృత్తి చేశారు. సూచించారు. డీఏ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.